
# ఊరూరా 'గులాబీ' జోష్

- విస్తృతంగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు
- చల్మెడకు పెరుగుతున్న మద్దతు
- పలు కులసంఘాల తీర్మానం





కోనరావుపేట: కొండాపూర్‌లో ఓటును అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నేతలు, ధర్మారంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ చంద్రయ్యగౌడ్, నాయకులు

కోనరావుపేట, అక్టోబర్ 25: మండలంలోని ధర్మారం, కొండాపూర్, గొల్లపల్లి, మామిడిపల్లి, మల్కపేటలో వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా గులాబీ నేతలు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ఓటు అభ్యర్థించారు. రానున్న రోజుల్లో చల్మెడతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ ప్రజల మద్దతు కూడగడుతున్నారు. ఇక్కడ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపు పరశురాములు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, గ్రామాధ్యక్షుడు ఉత్తేమ్ శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**'చల్మెడ' ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం**

కథలాపూర్, అక్టోబర్ 25 : 'చల్మెడను భారీ మెజార్టీతో గెలిపిస్తాం, కారు గుర్తుకే ఓటు వేస్తాం, బీఆర్ఎస్‌కు అండగా ఉంటాం' అంటూ జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలోని రజక, యాదవ సంఘాలు, కథలాపూర్ యాదవ సంఘం సభ్యులు బుధవారం మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును గెలిపించుకుంటామని మూడు కులసంఘాల సభ్యులు పేర్కొన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని కులసంఘాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడీల గంగాప్రసాద్, సర్పంచ్ అంబటి లత, పురుషోత్తం, ఎంపీటీసీ మల్యాల రమేశ్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, నాయకులు వర్దినేని నాగేశ్వర్‌రావు, మామిడిపెల్లి రవి, కల్లెడ శంకర్, ముస్కురి కిరణ్, సబ్బని గంగు, భూపెల్లి రాకేశ్, అల్లకట్ట శ్రీనివాస్, యాటకర్ల దుంపేటాద్రి, ఆకుల నర్సయ్య, మల్లేశ్‌యాదవ్, చెదలు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



కథలాపూర్: బీఆర్ఎస్‌కు మద్దతుగా తీర్మానం చేస్తున్న కులసంఘాల సభ్యులు పాల్గొన్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ, నాయకులు



కోనరావుపేట: గొల్లపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపు పరశురాములు, నాయకులు

## కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలి

- జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు
- మేడిపల్లి, భీమారం మండలాల్లో ప్రచారం



దమ్మన్నపేటలో బీడీ టేకేదార్‌ను కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు

మేడిపల్లి, అక్టోబర్ 25 : అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేట, భీమారం మండలం లింగంపేటలో బుధవారం వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావును కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు, రైతు బీమా, పంట రుణమాఫీ, ఒంటరి మహిళ, వితంతువు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లు తదితర అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, సర్పంచులు కాచర్ల సురేశ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు చెన్నమనేని రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొప్పెర లింగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు నలువాల వెంకటేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోతు గణేశ్, నాయకులు అంగడి ఆనంద్‌కుమార్, ఉదగిరి ఆదిరెడ్డి, పిట్టల రాజరెడ్డి, నెల్లుట్ల ప్రభాకర్, చెన్నమనేని అజిత్‌రావు, అన్‌రెడ్డి గంగారెడ్డి, బండ్ల నరేశ్, గాజుల శ్రీనివాస్, ఏనుగు మోహన్‌రెడ్డి, జవ్వాజి శేఖర్, మొనుగూరి నవీన్ పాల్గొన్నారు.

## ప్రచారంలో సాంకేతికత

చందుర్తి, అక్టోబర్ 25: మండలంలో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రచారం శరవేగంగా సాగుతుంది. ఓటర్లను ఆకట్టుకునేలా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రచార రథాలను సిద్ధం చేశారు. ఇప్పటికే మండలంలోని అత్యధిక గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచార రథాన్ని రూపొందించారు. భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేయగా దృశ్య రూపకంగా ప్రచారం చేస్తున్నారు. మండలానికి రెండు వాహనాలను కేటాయించగా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లు, కమ్యూనిటీ భవనాల వద్ద ప్రదర్శిస్తున్నారు.



మండలానికి చేరుకున్న ప్రచార రథం

# గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాల కవాతు



బోయినపల్లి: మండల కేంద్రంలో కవాతు చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

బోయినపల్లి, అక్టోబర్ 25: మండల కేంద్రంలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంత వాతావారణంలో జరిపేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పోలీస్ స్టేషన్లకు కేంద్ర సాయుధ బలగాలను పంపించింది. ఈ మేరకు కేంద్ర సాయుధ బలగాలు చేరుకుని బోయినపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ఈ కవాతులో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ మహేందర్ ఉన్నారు.

**కోనరావుపేటలో ..**

కోనరావుపేట, అక్టోబర్ 25: మండల కేంద్రంలో కేంద్ర పోలీసు బలగాలతో చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ ఆంజనేయులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రధాన కూడలి నుంచి పురవీధుల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల వేళ నగదు, మద్యం అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూస్తామని వెల్లడించారు. పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



కోనరావుపేట: మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

## నేడు మండలంలో చల్మెడ ప్రచారం

కోనరావుపేట, అక్టోబర్ 25: మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట, గోవిందరావుపేట తండా, వట్టిమల్ల, గొల్లపల్లి, కమ్మరిపేట తండా, భూక్యారెడ్డి తండా, మరిమడ్ల, అజ్మీరా తండా, కొండాపూర్‌లో వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, యువకులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## నేడు సద్దుల బతుకమ్మ



రుద్రంగిలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ, నాయకులు

రుద్రంగి, అక్టోబర్ 25: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా మహిళలు కొలిచే సద్దుల బతుకమ్మ పండుగను మండల కేంద్రంలో గురువారం జరుగనుండగా అధికారులు, ప్రజాప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని ముఖ్య కూడళ్లు, బతుకమ్మ కుంట వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రజల సౌకర్యార్థం మైదానాలను చదును చేసి బతుకమ్మ తెప్పలను సిద్ధం చేస్తున్నారు. బతుకమ్మ ఏర్పాట్లను ఎస్ఐ రాజేశ్, నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు తర్రె మనోహర్, పల్లి గంగాధర్ తదితరులు ఉన్నారు.

## సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరి బైండోవర్

చందుర్తి, అక్టోబర్ 25 సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను పోలీసులు ఇద్దరిని బైండోవర్ చేశారు. మల్యాల గ్రామంలో మన మల్యాల అనే వాట్సాప్ గ్రూప్ లో రెండు వర్గాల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా పోస్టులు చేసిన పోశెట్టి అంజయ్య, పాటి సుధాకర్ ను చందుర్తి తహసీల్దార్ ముందు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ బైండోవర్ చేశారు. ప్రజలు సోషల్ మీడియా వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని లైక్, షేర్, ఫార్వర్డ్ చేసే ముందు సరి చూసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్ హెచ్చరించారు